
# పరాజిత



కుమారి సుధ

'మమ్మీ! చీకటిపడింది, ఇక వెళదామా' అంటూ మెడచుట్టూ చేతులు వేసిన, పాపమాటలు విని, కుచ్చిళ్ళపై పడిన దుమ్మును దులుపుకుంటూ లేచి నిలబడింది. పాప చేతిని పట్టుకుని ఒక్క అడుగు ముందుకు వేసిందోలేదో, వెనుక నుండి మమతా! అన్న పరిచయమైన కంఠస్వరము విని వెనక్కు తిరిగింది. వెనక విజయ్ నిలబడిఉన్నాడు.

సుమారు ఆరేళ్ళ అనంతరము కనబడిన అతనిని చూడగానే, ఆనందముతో ఏమి మాట్లాడాలో తెలియలేదు మమతకు. ఒక్క క్షణము అలాగే చూస్తూ నిలుచుంది. 'యేం? అలా చూస్తున్నావు, నేనేమైనా మారానా' అంటూ తనవైపు చూసుకుంటూన్న విజయ్‌ను చూసి తెప్పరిల్లి 'అబ్బ, మనము కలసి ఎన్నాళ్ళ ఐంది. అలా కూర్చుని మాట్లాడుకుందాం రా, అంటూ ముందుకు దారి తీసింది ముగ్గురూ కూర్చున్నారు.

'ఇక్కడికి కెట్లావచ్చావు?' అన్నది.

'ప్రమోషనుమీద వచ్చాను. మీ రిక్కడుండబట్టి ఎన్నాళ్ళయింది?'

'ఓ! వెరీగుడ్. కంగ్రాచులేషన్స్' అన్నది మమత.

ఇంతసేపూ మౌనంగాకూర్చున్నపాప విజయ్‌ను చూపిస్తూ 'ఎవరు మమ్మీ'

'మామ, పాపా' అంది.

తనవంకే కుతూహలముగా చూస్తున్న పాపను చూసి 'నీ పేరేంటి పాపా' అన్నాడు.

'చరిత' అంది చక్రాల్లాంటి కళ్ళను త్రిప్పుతూ.

'పాప అంతా నీ పోలికే మమతా! అదృష్టవంతురాలివి' అన్నాడు పాపవంక ముచ్చటగా చూస్తూ

కుమారి సుధ

'ఔను, ఈవిషయములో మాత్రము' అంది అదోవిధముగా నవ్వుతూ

'అది సరేగాని ఒంటరిగానే వాచ్చావా? శ్రీమతితో...'

'అగాగు, నే నింకా బ్రహ్మచారినే' అన్నాడు నవ్వుతూ.

'ఏం? ఇంకా నీ ఊహా సుందరి దొరకలేదా?'

'ఆ బాధ్య తంతా అమ్మా నాన్నది.' అని విజయ్ తనవంక చూస్తున్న మమతతో 'ఎంత చదువుకొన్నా ఇంకా పాత అభిప్రాయాలే అని ఆశ్చర్యంగా ఉందా యేమిటి' అన్నాడు.

'ఊహూ! అదికాదు. నీ వింకా మారలేదంటే ఆశ్చర్యమే. యూనివర్సిటీ వాతావరణమన్నా మార్చాల్సింది. కాని ఏమిటో విజయ్, ఎంతసేపూ ఆదర్శాలంటూ వాదించడమే కాని నిజజీవితములో కొచ్చేసరికి అవన్నీ మర్చిపోవలిసివస్తుంది' అన్నది.

మమత మాటలు వినగానే, విజయ్ గర్వంగా ముఖము పెట్టి 'ఐతే నేను చెప్పింది నిజమయిందన్నమాట. నువ్వు మనిషివి ఏమీ మారలేదు కాని, నీ మాటలు చాలా మారాయి. మునుపటి లాగానే వాదిస్తున్నావా' అన్నాడు కుతూహలంగా.

'మన మనసుకున్న వన్నీ జరగడానికీ, ఆచరణలో పెట్టడానికీ ఇదేమన్నా సినిమానా, నాటకమా? అయినా అవన్నీ మరిచిపోయి చాలారోజు లయింది ఇప్పుడు నే నొక సామాన్య గృహిణిని నాకు యేమీ ఆదర్శాలూ కోరికలూ లేవు' అంది నవ్వుతూ.


మమత నవ్వును చూసి ఆశ్చర్యపోయాడు విజయ్. ఆ నవ్వులో యే విధమైన కళాకాంతులు కాని, ఉత్సాహము కాని లేవు. యేదో నవ్వా లని నవ్విన ట్లుంది. పూర్వంలా చిలిపిగా, కవ్విస్తూ మాట్లాడే మమత, తూచితూచి యేదో పోగొట్టుకొన్నదానిలా మాట్లాడుతున్నది

'నేను వచ్చినప్పటినుండీ చూస్తూనే ఉన్నాను. నాతోటి పరాయిదానిలా ప్రవర్తిస్తున్నావు. అసలు సంగతేమిటి' అన్నాడు.

'ఏమీలేదు' అన్నది తలవంచుకొని

'ఊహు, నాదగ్గర నీకు దాపరికమేమిటి? నీవు చెప్పేదాక నేను లేవను' అన్నాడు, చిన్న పిల్లాడిలా. అతన్ని చూసి వచ్చే నవ్వు నాపుకుంటూ, 'మరొకసారి చెప్తాను, ఇక పోదాము రా' అంటూ లెచి నిలబడింది.

మమత, పాప చేతిని పట్టుకొని నడుస్తూ ఉంది. ఆ చల్లని గాలికి ఆమె ఆకుపచ్చంచు పైటచెరగు ఎగురుతూ ఉంది ఆ నల్లని జడ మెల్లగా నడుస్తున్న ఆమె కనుగుణంగా అటు ఇటు కదులుతూ ఉంది ఆమె ప్రక్కగా నడుస్తున్న విజయ్ యేదో జ్ఞాపకము వచ్చినవాడిలా ఆగి 'మమతా!' అన్నాడు




'ఏం' అంది పక్కకు చూస్తూ.

'నువ్వు చాలా చెడ్డదానివి.'

'ఏం' అంది విచిత్రంగా.

'నేను తొందరలో బావగారి సంగతి అడగడము మర్చిపోయాను. నువ్వు కూడా చెప్పకుండా ఊరుకున్నావు. నువ్వన్నా జ్ఞాపకము చేయకూడదేం?' అన్నాడు కోపంగా.

నీకు ఇంత మతిమరపని నాకు తెలియదే. ఈ సారికి క్షమించు. అయినా మా విజయ్ చాలా మంచివాడు. నేను చెప్పినట్లు వింటాడు' అంది నవ్వుతూ.

ఆమె నవ్వు చూచి 'నీకు ప్రతిమాటకూ నవ్వువస్తుంది సరేగాని మమతా, బావగారు ఎలా ఉంటారు' అన్నాడు

'నువ్వే చెప్పు' అంది అతనివం చూస్తూ.

'ఉండు. చూడని మనిషిని ఎట్లా చెప్పమంటావు. అయినా ఆలోచిస్తా నుండు' అన్నాడు.

ఆలోచిస్తూ నిలబడిన అతనిని చూస్తూ 'రేపు తప్పకుండా వస్తావుకదూ' అంది.

'అలాగే! బావగారిని అడిగినట్లుగా చెప్పు' అన్నాడు.

ఇంటికి వెళ్ళి పాపకు అన్నము పెట్టి పక్కలో పెట్టుకుని పడుకుంది. భర్త ఇంకా ఇంటికి రాలేదు. ప్రక్కలో పడుకున్న పాప 'మమ్మీ! రేపు నేను స్కూలుకు వెళ్ళను' అంది

'ఎందుకూ' అంది ఆశ్చర్యంగా

'మరి ! మరి ! రేపు ఆ మామయ్య మనింటికి వస్తాడుగా మమ్మీ! మామయ్య మంచివాడుకదూ?' అంది తల్లి ముఖం లోకి చూస్తూ

పాప మాటలు వింటూ ఉలిక్కి పడింది మమత. ఔను. ఇంత పెద్దవా డయ్యాకకూడా తనముందర మాత్రము చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తాడు. తనకు మాత్రము అతడిని చూస్తే ఎవరినో ఆత్మీయుడ్ని చూసినట్లుగా ఉంటుంది. అందుకే సహజంగా మగపిల్ల లంటే అసహ్యించుకొనే తను విజయ్ తో స్నేహము చేసింది.

అప్పుడప్పుడూ తను నవ్వుతూ అంటూఉండేది. — నిన్ను చూసినప్పటి నుండి మగవారిపై నాకు గల అభిప్రా యము పావువంతు మారిపోయింది — అని — ఓ ! అయితే నావంటి నలుగురిని చూస్తే ఇక నీవు పూర్తిగా మారిపోతావు— అనగానే, ఆ మాట పూర్తికాకుండానే — అంతవరకూ రాలేదులే—అనేది నవ్వుతూ.

మధురమైన గతస్మృతులు మమత కళ్ళముందు తెరలుగా వస్తున్నాయి.

బి. ఏ. చదివే రోజుల్లో విజయ్‌తోటి పరిచయ మైంది. అప్పుడప్పుడు వచ్చి పోతుండేవాడు. తనదీ, అతనిదీ ఒకటే సబ్జక్టు కావడంచేత, తెలియనివి చెపూ వుండడము పరిపాటయింది. తెల్లటి చిన్నగా, సన్నగా ఉండే విజయ్, తెలి యని పాఠాలు అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టుగా చెపూ ఉంటే, విస్ఫారితనేత్రాలతో ఆశ్చర్యంగా వింటూ ఉండేది మమత పరీక్షలు అయి పోయాయి.

ఒకరోజు విజయ్ వచ్చేసరికి మమత 'విరాజ్ బహూ' చదువుతూ ఉంది. కుర్చీలో కూర్చుంటూ 'ఆ నవలపై నీ అభిప్రాయ మేంటి' అన్నాడు.

'ఛీ! ఛీ! స్త్రీ అంత పతివ్రతగా, భర్తకు అణగి మణగి ఉంటూ, అతని చేత చెప్పుదెబ్బలు తింటూ ఉండడము నేను సహించలేను' అంది ఆవేశంగా.

ఆమె ఆవేశము చూచి నవ్వుతూ 'ఊ ! ఇంకా.'

అతని నవ్వు చూచి ఒళ్ళు మండింది. 'స్త్రీ కూడా ఒక మనిషే, ఆమెకు కూడా స్వతంత్రభావాలూ అభిప్రాయాలూ ఉన్నాయి. మగవాడు ఇష్టమువచ్చినట్టు ఆడించడానికి కీలుబొమ్మకాదు. శరత్ స్త్రీని అంత బలహీనంగా చిత్రించడము సమంజసముగా లేదు. అయినా అప్పటి కాలము వేరు. అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా ఉంది. ఆడవాళ్ళు చదువుకొంటు న్నారు, డిగ్రీలు సంపాదిస్తున్నారు. మగ వారి ఇష్టప్రకారము నడవడానికి తమ వ్యక్తిత్వము చంపుకొని ఉండుటకు ప్రస్తుతము యువతులు సిద్ధముగాలేరు. వారుకూడా పురుషులవలె అర్జనాపరులు. కుటుంబాన్ని స్వయంశక్తితో పోషించ గలుగుతున్నారు అనాడు స్త్రీ అబల



యువ

కాలచక్రాని నేడు పలల పురుషులతో పాటు అన్ని రంగాల్లోను స్త్రీలు నడుములు బిగించి ముందుకు వస్తున్నారు ఇప్పటి వనిత మగవారికి ఏమాత్రము తీసిపోదు తెలుసా !' అంది మమత గర్వంగా.

'నీ అభిప్రాయాలు బాగానే ఉన్నాయి. కాని మొదలు వాళ్ళు డిగ్రీలు సంపాదించి ఉద్యోగము చేసేదానికంటే, ఇంట్లో ఉండి సంసారము చక్కదిద్దుకుంటూ, భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ, పిల్లలను భావి పౌరులుగా తీర్చే భారము స్త్రీవిధి' అన్నాడు.

'కాని నేనైతే ఆవిధంగా ఎప్పుడూ ఉండలేను. నా అభిప్రాయాలను గౌరవించవంతవరకు, ఇతరులను లెక్కచేయను ఎవరైనా కానీ.'

'లేదు మమతా ! నీ అభిప్రాయము పూర్తిగా తప్పు. ఎవరినో చూచి, అందరిపై అదే అభిప్రాయము యేర్పరచుకొన్నావు. భారతదేశములో పురుషుడు స్త్రీకి ఏ దేశములో ఇవ్వనంత గౌరవము ఇస్తున్నాడు. ఆమెను తన జీవిత భాగస్వామిగా, గృహిణిగా, తన పిల్లలకు మాతృమూర్తిగా స్త్రీని ఎంతో ఆరాధిస్తున్నాడు.'

'ఆరాధిస్తున్నాడంటే, నాలుగుగోడల మధ్య పెట్టి, బైటికిరాకుండా చేస్తున్నాడు; అంతేగా, అంది హేళనగా.

విజయ్ తొందరగా, 'కాదు మమతా, నేను చెప్పేది నీవు సరిగా అర్థము చేసుకోవడములేదు అన్నాడు.

'సరిగానే అర్థము చేసుకొంటున్నాను. తను మాత్రము బయట కులాసాగా తిరుగుతూ అందరు ఆడవాళ్ళతో మాట్లాడవచ్చును. కాని భార్య రోడ్డుమీద నడుస్తూ తల పైకెత్తిచూసిందంటేచాలు, ఉగ్రుడైపోతాడేం ? తను మాత్రము సర్వస్వతంత్రుడా, మగవాడు? స్త్రీకికూడా హృదయముంది. తన విషయము ఆలోచించుకోగలదు అని విడచి పెట్టరేం ?'

'ఒక అన్నగారు, తను మాత్రము బయట స్నేహితులతో వేళాపాళా లేకుండా సినిమాలకు, షికార్లకు తిరుగుతాడు. కాని చెల్లెల్నుమాత్రము బయటకు రావద్దని ఆంక్షలు విధిస్తాడెందుకు ? ఆమె మాత్రము మనిషికాదూ ? తనకు మాత్రము కోరిక లుండవూ ?

'తండ్రి తన కొడుకుని ఎన్నిసార్లు తప్పినా చదివిస్తూ, కూతుర్ని మాత్రమెందుకు చదివించడు ? ఆమెకు పెద్ద చదువులు చదవాలని ఉండదూ? స్త్రీ ఇన్ని అన్యాయాలను యుగాలనుండి సహిస్తూ ఉంది. బయటకు క్రక్కాలంటే పూర్వపు సంఘాచారాలు అణచివేస్తున్నాయి ఒక వేళ ఎదురు తిరిగినా అది తల్లిదండ్రులకు తలవంపు. సంఘము ఆమెను విచిత్రంగా చూస్తుంది.

'ఒక్కసారి ఇతరదేశపు స్త్రీనీ, మనదేశపు స్త్రీనీ పోలిస్తే, మన స్త్రీ స్థానము సమాజంలో ఎంతుందో అర్థ మౌతుంది మరీ మధ్యతరగతి మహిళలు అటు సహించనూలేరు, ఇటు తెగించనూ లేరు రెండింటి మధ్యా నలుగుతున్నారు ఇదీ మా బలహీనత ఇన్ని అత్యాచారా లను సహిస్తూ, పురుషుని ఇంకా యే హృదయముతో చూడమంటావు, అర్థము చేసుకోమంటావు అందుకే స్త్రీకి విద్య అవసరము తనశక్తి నంతా తెలసుకోవాలి, కాని మన సమాజమూ, పురుషులూ తెలసుకోనివ్వరు అంతే కాదూ? ఛీ! ఛీ! యేం మనుష్యులు నాకు నిజంగా ఒక్కోసారి ఇదంతా తలచుకుంటే, ఈ మనుష్యులకి దూరంగా ఎక్కడకో పారిపోవా లనిపిస్తుంది' అంటూ ముగించింది మమత

నీవు చెప్పినదంతా నిజము కావచ్చు, కాని నీవు గోరంతలు, కొండంతలుగా చేసి బాధ పడుతున్నావని నా అభి ప్రాయము' అన్నాడు విజయ్

'నన్నెవరూ అర్థము చేసుకోరు అయినా మీరూ మగవారేగా! మా ఆవేశాలూ, ఆవేదనలూ యెట్లా అర్థమవు తాయి. అందర్నీ అర్థము చేసుకునేదేవుడు కూడా మగవాడే కనుక మా కష్టాలెలా తెలుస్తాయి లేకపోతే కాస్తలో కాస్త యినా సానుభూతి చూపెట్టేవాడు' అంది ఆవేశంగా

ఆమె ఆవేశం చూచి ఆశ్చర్యపోతూ, 'అయితే దేవుడే లేడంటావా' అన్నాడు

'ఊఁహూ' అంటూ తల అడ్డంగా త్రిప్పి 'నీకు ఉన్నాడేమో కాని నాకు మాత్రము లేడు' అన్నది కవ్విస్తూ

'నీవు ఏమన్నా అనుగాని, దేవుడు లేడంటేమాత్రం నేను ఊరుకోను దేవుడు లేనిది అసలు ప్రపంచమేలేదు ఆయన ఆజ్ఞ లేనిది ఆఖరికి పరమాణువు కూడా కదలదు, తెలుసా!' అన్నాడు కోపంగా

'ఇది అటామిక్ ఏజ్ అంత కోప మెందుకుగాని ఎక్కడున్నాడో చూపించు' అంది వ్యంగ్యంగా నవ్వుతూ కోపంతో ఉన్నవారిని ఇంకా కవ్వించటము మమత కొక సరదా ఆరోజు సంభాషణ ఎంతదూరము పోయేదోగాని, మమత స్నేహితురాలు లత రావడంతో ఆగి పోయింది

'ఏదో వాగ్యుద్ధము జరుగున్నట్లుందే' అంది వస్తూనే వాతావరణాన్ని పసిగట్టి

'చూడవే' అంటూ చెప్పబోతుంటే, విజయ్ మధ్యలోనే 'ఎలాగైనా మెజారిటీ మీది, ఓటమి తప్పదు అంటూ వెళ్ళి పోయాడు మమత కళ్ళు గర్వంతో మెరిసాయి

ఒకరోజు విజయ్ వచ్చి, 'నే నింకా రెండురోజులలో మా వూరు వెళ్ళిపో తున్నాను' అన్నాడు




'ఏమంతతొందర, పోవచ్చులే '

'పరీక్ష లయి ఎన్ని రోజు లయిందో తెలుసా ! అయినా రమ్మని ఉత్తరము కూడా వచ్చింది' అన్నాడు

'రిజల్ట్సు వచ్చాక యేమి చేస్తావు విజయ్ ?'

'ఎమ్ ఏ కు అప్లయి చెయ్యాలి. మరి నువ్వో ?'

'నేనుకూడా ఎమ్. ఏ చేసి తరువాత పిహెచ్ డి. చేస్తాను అంది.

'ఈ లోగా మూడుముళ్ళూ పడితే' అన్నాడు హాస్యంగా.

'ఛీ! ఇటువంటి మాటలు అనవద్దని ఎన్నిసార్లు చెప్పాలి— నే నిప్పుడిప్పుడే మేం చేసుకోను' అన్నది; ఇప్పుడు ఇంతగావాదిస్తున్న నోరు తండ్రియెదుట మూత పడుతుందని తెలిసికూడా.

'ఓహో' అంటూ నవ్వాడు.

అతని నవ్వు చూచి ఒళ్ళు మండింది. 'మరి నా గురించి అడిగారుగాని, తమరి కాబోయే భార్య యెలా ఉండాలో సెలవిస్తారా?' అంది.

'ఎట్లా ఉండాలో నువ్వే చెప్పు' అన్నాడు ఆసక్తిగా, ఆమె కేసి చూస్తూ.

'బాగా చదువుకొని.......'

'బాబోయ్! చదువుకొన్న పిల్లనే' భయము నటించాడు విజయ్. 'ఆమె నీలాగే ప్రతిమాటకూ వాదిస్తూంటే, జీవితాంతమూ ఎలా వింటూ కూర్చోమంటావు' అన్నాడు.

'లేకపోతే, మీ అమ్మా నాన్నా చూపించిన ఒక యెద్దుని చేసుకొంటే సరి!' అంది కోపంగా

'అలా పూర్తిగా తీసివేయకు మమతా! మన జీవితం మన చేతుల్లోనే ఉంది జీవితాన్ని దుఃఖమయం, సుఖమయం చేసుకోవడము మనపైనే ఆధారపడి ఉంది. నువ్వన్నట్లు నాకు అలాంటి భార్యే దొరుకుతే, ఆమెకు చదువు చెప్పి, నాకు అనుకూలంగా తీర్చి దిద్దుకుంటాను' అన్నాడు. అతని మాటల్ని తేలికగా తీసిపారవేసింది మమత.

అట్లా మధురంగా, వాదోపవాదాలతో దినాలను నిముషములుగా గడిపిన రోజులవి.

విజయ్‌కు మద్రాసులో సీటు దొరికింది. మమతకుకూడా సీటు దొరికింది కాని ఇంట్లో ఒప్పుకోలేదు. తల్లిదండ్రులతో వాదింది లాభం లేదని మౌనంగా ఊరుకుంది.

తరువాత రెండునెలలకే ఒక ఆఫీసర్తో మమత వివాహము నిశ్చయమైంది. వివాహానికి ముందు అతడు తన అభిప్రాయాలను తెలనుకో గోరుతున్నాడని విని, అతని సహృదయతకు ఎంతో పొంగిపోయింది.

వివాహమైనతరువాత ఒకరోజు పేపరు చదువుకొంటున్న భర్త దగ్గరకు వచ్చి మమత, 'ఏమండీ! నాకు ఇంట్లో పనికూడా ఎక్కువలేదు. ఇంత చదివి ఉట్టిగా ఇంట్లో కూర్చోవడమంటే, విసు గనిపిస్తుంది. ఏదైనా ఉద్యోగం చేస్తే ...'

'ఏం? నా సంపాదన చాలడంలేదా?' అన్న తీవ్రకంఠస్వరము విన్నది.

'అహాఁ! అది కాదు నా ఉద్దేశము. మధ్యాహ్నముపూట యేమీ తోచడము లేదు' అంది.

'ఏమీ తోచకపోతే యేదైనా కుట్లు, అల్లికలు నేర్చుకోంటే తప్పా - ఎంతసేపూ ఆ పుస్తకాలు పట్టుకొని చదవకపోతే? అసలు చదువుకొన్నందుకే మీ ఆడవాళ్ళ కళ్లు నడినెత్తిమీదుంటే, ఇక ఉద్యోగాలు చేస్తే బాగుపడ్డట్టే' అని తిరిగి పేపరులో లీనమైపోయాడు. త నన్న మాటలకు అతని మాటలు - అతని కెందుకంత కోపము వచ్చిందో అర్థము గాక అలానే ఆలోచిస్తూ నిలబడింది మమత.

ఇంకోరోజు మమత ఆటోగ్రాఫ్ పుస్తకము చూస్తూ మొదటి పేజీలో ఉన్న విజయ్ పేరును చూసి, 'ఎవరీ విజయ్' అన్నాడు.

విజయ్ పేరు చూడగానే మమతకు అంతా ఒక్కసారిగా జ్ఞప్తికి వచ్చింది. సంతోషంగా, 'అయ్యో! మీకు చెప్పడమే మరిచాను. ముందు మా ఇంటి దగ్గరనే ఉండేవాడు. ఇప్పుడు యూనివర్శిటీలో చదువుతున్నాడు. నాకు అర్థము కాని పాఠాలు ఎంతో బాగా చెప్పేవాడు. అసలు నాకు అతనివల్లే క్లాస్ వచ్చింది. ఇక వాదించడములో నన్ను ఓడించడానికి ప్రయత్నించేవాడు. ఒక్కోసారి గంటలతరబడి వాదించుకొనేవాళ్ళము. నిజంగా అతడొక విచిత్రమైన వ్యక్తి...' అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న మమత 'ఇక చాలించు' అన్న గర్జనతో బిత్తరపోయింది.



'నువ్వంటే యేమో అనుకొన్నాను గాని, నీ వెనుక ఇంత చరిత్రుందని తెలియదు' విసురుగా బయటకు వెళ్ళిన భర్త మనస్తత్వాన్ని · ఏవగించుకొంది మమత.

ఇంకోసారి ఏదో జవాబిచ్చినందుకు, 'మమతా! నాకు ఎదురు చెప్పొద్దని ఎన్నిసార్లు చెప్పాను' అన్నాడు విసురుగా. అది గమనించని మమత, చేతిలోని కాఫీ కప్పును టీపాయి మీద పెడుతూ, 'తమరి ఆఫీసర్ హోదా ఇక్కడ ప్రదర్శిస్తున్నారే. ఇది ఆఫీసు కాదండోయి ఇల్లు' అన్నది హాస్యంగా నవ్వుతూ.

'మమతా!' అరిచాడు. 'నీ కాలేజీ తెలివితేటల్ని నా ముందర వెలగబెట్ట నవసరము లేదు. అయినా ఇల్లు దిద్దు కోవడానికి ఈ బి.ఏ.లూ ఎమ్.ఏ.లూ ఎందుకో' అన్నాడు.

'ఛీ! ఛీ! ఎటువంటి మనిషి. చదువు మగవారికే కాబోలు. ఆడదంటే ఎంత నీచభావం ఈయనికి' అనుకొని, ఆ మాటలే రాత్రి డైరీలో వ్రాసుకొంది.

ఆ డైరీ ఒకనాడు చదివి మండి పడ్డాడు. తనకు ఎదురు తిరిగేవారు తన ఇంట్లో అవసరము లేదన్నాడు.

"తన ఇల్లు" విరక్తిగా నవ్వుకుంది మమత. ఎంతసేపు ఈయనకి "తన ఇల్లు", "తన మాట" తప్ప ఇతరుల సంగతి అవసరములేదు. ఎంతస్వార్థము. ఎంత చదువుకొన్నా, ఇతరుల డైరీలు చదివే మనిషికి యేమాత్రం సంస్కారము ఉన్న దనుకోవాలి.

ఇంతలో విజయ్ మాటలు జ్ఞాపకము వచ్చాయి—చదువుతో సంస్కారాన్ని కొలవడం పొరపాటు. దేని కదే. చదువు కున్నంత మాత్రాన సంస్కార మొస్తుం దనుట భ్రమ మాత్రమే.

అతని మాటలను తేలికగా తీసి పారేస్తూ—అబ్బ బి. సి. నాటి మాటలు మాట్లాడకు—అంది విసుక్కొంటూ.

గతస్మృతు లన్నీ ఆలోచిస్తున్న మమతకు, భర్త వచ్చినట్టే తెలియలేదు. 'మమ్మీ! నాన్న పిలుస్తున్నారు' అంది పాప ఉలిక్కిపడిలేచి 'ఎంతసేపయింది వచ్చి' అంది

'ఏం? ఇంకా ఊహాగానము పూర్తి కాలేదా' అన్నాడు. విననట్లే లోపలికి పోయింది—విన్నా చేసే దేమీలేదు.

భోజనా లయినతరవాత పడుకొనే టప్పుడు పాప 'నాన్నా! ఇవ్వాళ బీచిలో కలిసిన మామయ్య రేపు మనింటికి వస్తానన్నాడు' అంది.

'ఎవ రది మమతా' అన్నాడు ఆశ్చర్యంగా.

భయపడ్తూనే తలొంచుకుని, 'విజయ్ ఇక్కడకు వచ్చాడట. రేపు మనింటికి వస్తా నన్నాడు' అంది.

'ఏం? బీచిలో కలుసుకొన్నది చాలక, ఇంటికికూడా వస్తానన్నాడా? ఇవన్నీ సాగడానికి ఇది మీ పుట్టిల్లుకాదు. నా ఇంట్లో ఇటువంటి వెధవవేషాలు పనికి రావు' అన్నాడు తీక్షణంగా.

మాటకు మాట వాదిస్తూ, అందరినీ తన మాటలచేత ఓడించి, విజయ గర్వంతో తన ఆదర్శాలను వల్లిస్తూ తిరిగే ముగ్ధ కాదిపుడు మమత.

పరాజయంతో, తన ఆదర్శాలను వమ్ముచేసుకొని, జీవితముతో రాజీపడి బ్రతకడము నేర్చుకొన్న సంపూర్ణ భారతయువతి.

'భగవాన్ నన్నెవరూ అర్థంచేసుకో లేరు, చేసుకోరుకూడా' అంటూ చెంప లపై జారే కన్నీటిని తుడుచుకొంటూ పక్కకు తిరిగి పడుకుంది మమత.